776) వరాళి

ప॥ దైవమా నీ చేతిదే మాధర్మపుణ్యము। పూవు వంటి కడు లేత బుద్ధి వారము॥

చ॥ యేమిటి వారము నేము యిదివో మా కర్మమెంత। భూమి నీవు పుట్టించగ బుట్టితిమి।
నేమముతో నడచేటి నేరుపేది మావల్ల। దీముతో మోచిన తోలు దేహులము॥

చ॥ యెక్కడ మాకిక గతి యెరిగే దెన్నడు నేము। చిక్కినట్టి నీ చేతిలో జీవులము।
తక్కక నీ మాయలెల్లా దాటగలమా మేము। మొక్కలపుటజ్ఞానపు ముగ్ధలము॥

చ॥ యేది తుద మొదలు మాకిక నిందులో నీవే। ఆదిమూర్తి నీకు శరణాగతులము।
యీదెస శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె। నీదయ గలుగగాను నీ వారము॥